7

# న్యాయాధిపతుల కాలము

## యెహోషువ మరణమునుండి సౌలు అభిషేకింపబడేవరకు, క్రీ.పూ. 1400-1095 (న్యాయాధిపతులు; రూతు; 1 సమూ. 1-10)

### I. మత సంబంధమైన పరిస్థితి.

ఇశ్రాయేలీయుల మత సంబంధమైన పరిస్థితులు ఈ విధంగా సంగ్రహింపవచ్చు:

**1. విగ్రహారాధనలోనికి మాటిమాటికి వెళ్ళుట.** – కారణాలు కనుగొనవలసి యుంటుంది.

ఎ. వారిది విగ్రహారాధనతో కూడిన వారసత్వం (ఆది. 31:19; 35:2; యెహోషువ 24:2–14లను పోల్చి చూడు). – అబ్రాహాము విగ్రహారాధనను విడిచిపెట్టాడు, అయితే యాకోబు వివాహంతో, అది కుటుంబ జీవితంలో ప్రవేశించింది; మరియు, విగ్రహాలను పాతిపెట్టినా, దాని జాడలలో కొన్ని కొనసాగి ఉండవచ్చునేమో.

బి. వారి ఐగుప్తు బానిసత్వం (నిర్గమ. 32:21–34; యెహోషువ 24:14లను పోల్చి చూడు). – సీనాయి పర్వతం దగ్గరే అంత హీనంగా, అంత త్వరగా విగ్రహారాధనలో ఇశ్రాయేలీయులు మునిగిపోయారంటే, అరణ్యపు క్రమశిక్షణ దాన్ని పూర్తిగా రూపుమాపలేక పోయిందని యెహోషువ ప్రసంగమే రుజువుగా ఉంది.

సి. కనాను జాతుల అపవిత్రత. – ఆ కాలంలో కనాను హీనాతి హీనమైన మత విధానానికి కేంద్రమైయుంది. వారి మతాల్లోనుండి కార్తేజ్, గ్రీసు, రోములు కామలోలతగల లక్షణాలను అరువు తెచ్చుకున్నారు. దానిని బట్టి, కనానీయులను బయటికి నెట్టివేయనన్నా నెట్టివేయాలి లేదా తుంచి వేయనన్నా తుంచి వేయాలి అనేది దైవికమైన శాసనమైయుంది. ఇశ్రాయేలీయులకు అదియే క్షేమం. అమోరీయుల అన్యాయం పరిపూర్ణమయ్యింది. శాసనానికి లోబడకపోవడం, దాన్ని వెంబడించిన అంతర్ వివాహాలు, పవిత్రమైన మతానికి ఎడతెగని పీడగా మారిపోయింది.

**2. తత్ ఫలితంగా మాటిమాటికి అణచబడ్డారు.** – పొరుగు జాతులచే అణచబడడం సహజమైన ప్రతిఫలంగా మారిపోయింది. నైతికంగా బలహీనులైన వారు రాజకీయంగా బలహీనులయ్యారు. క్రమశిక్షణ కొరకైన తీర్పులుగా కూడా అవి జరిగాయి. మరల మరల మోయాబీయులు, మిద్యానీయులు, ఫిలిష్తీయులు అనేవారిచేత బాధింపబడిన ఇశ్రాయేలీయులు, తమ్మును బాధించిన వారి విగ్రహారాధననుండి యెహోవా వైపుకు తిరిగారు. దీర్ఘకాలంలో ఎక్కువ పవిత్రమైన విశ్వాసమే విజయం సాధించింది.

**3. విడిపించుటకు లేచినవారిని న్యాయాధిపతులన్నారు.** – వీరు ఆదర్శమైన మనుష్యులు కాదు. క్రైస్తవ విశ్వాసవీరుల కంటే వారు ఎంతో తక్కువైన వారే. తరచుగా మూఢ నమ్మకాలుగల, తరచుగా కోపగించుకొనే, నైతికంగా బలహీనులైనవారే, అయినా వారు దేవునియందు నమ్మికయుంచారు. ఆ సమయాల్లో అదే పెచ్చు. పౌలు గాని లేక లూథర్ గాని తమ తరము వారిని అధిగమించినవారైనట్టు, వారు తమ కాలంకంటే అధిగమించియున్నారు. పైగా, వారు దేశభక్తులు. అధికమైన గోత్రపు అసూయలు ప్రబలియున్న ఆ కాలంలో, వారు అధికమైన దేశభక్తిగలవారైయుంటారు. వారు ఆ కాలపు టెల్స్, వాలెసెస్, మరియు వాషింగ్‌టన్స్.

## II. రాజకీయ పరిస్థితి.

ఒక జాతీయమైన నిర్వహణ గాని, జాతీయమైన ప్రధాన నగరం గాని, జాతీయ నాయకుడు (రాజు) గాని లేదు. మోషే ఒక మత విధానాన్ని యిచ్చాడే కాని స్పష్టంగా నిర్వచింపబడిన రాజకీయపు ఏలుబడి ఏదీలేదు. వారు పన్నెండు గోత్రములవారు, ఉభయ రక్షణకు కొన్నిసార్లు ఒకటౌతారు, కొన్నిసార్లు ఒకరినొకరు లయపరచు కోవాలనేవరకు దాదాపు తగవులు పడతారు. వారి పరిస్థితి ఎగ్‌బెర్ట్ క్రింద ఏకం చేయబడక ముందు యాంగ్లోశాక్జన్ హె ప్టార్చీతో పోల్చవచ్చు. పన్నెండు చిన్న రాజ్యాలుగా విడిపోకుండ వారిని బంధించిన మూడు బంధాలున్నాయి.

**ఎ. ఏక పితృత్వం మరియు చరిత్ర.** – అబ్రాహాము ఈ వంశ స్థాపకుడు. ఇస్సాకు, యాకోబులతో వారు తమ భక్తి మర్యాదలను పంచుకుంటారు. యోసేపు, మోషే, యెహోషువవంటి వారి పేర్ల ఖ్యాతి, ఎర్ర సముద్రం, యొర్దాను, యుద్ధ విజయాల మహిమ వారి జాతీయ వారసత్వమై ఉన్నాయి.

**బి. ఉమ్మడియైన భాష, హెబ్రీ.** – రకరకాలైన ప్రాంతీయ లేక స్థానిక భాషా భేదాలున్నట్టు జాడలున్నాయి, కాని ఈ భేదాలు ఇంగ్లాండులో ఆల్ఫ్రెడ్ కాలంలో ఇంగ్లీషుకు ఉన్న భేదాలవంటివే.

**సి. ఉమ్మడి మతం.** – ప్రత్యక్షగుడారం షిలోహులో ఉంది. అక్కడ బలిపీఠముంది. జాతీయ ప్రధాన యాజకుడు అక్కడ ఉన్నాడు. అనుదినము జాతీయ అర్పణ బలులు జరుగుతూ ఉంటాయి. మూడు సంవత్సరపు పండుగలకు ఈ గోత్రముల ప్రతినిధులు అక్కడికి వెళ్లుతూ ఉంటారు. అలాటి కేంద్రీకృతమైన శక్తులు పని చేస్తున్నాయి. గ్రీసు దేశస్థులకు కూడా యిలాటి బంధకాలే ఉన్నాయి; భౌగోళిక పరిస్థితులు ఆరంభంలోనే ఎంత బలమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించిందంటే, వారు ఎన్నడు ఒకే జాతిగా (దేశంగా) రూపొందకుండ లేక ఒక దానితో నొకటి చేరుకొనడానికి ఎన్నడు కుదరలేదు. అయితే ప్రవక్తయైన సమూయేలు, మరియు రాజైన దావీదునందు ఉన్నతమైన రాజకీయ క్రమబద్ధతను కనుగొని, వారిని ఒక రాజ్యంగా బంధించేవరకు హెబ్రీయులు తమకున్న కట్టుబాట్లను కాపాడుకున్నారు.

## III. **ఆరు ప్రధానమైన దండయాత్రలు.**

జాతీయ జీవితం రూపుదిద్దబడే ఈ వన్య జీవిత కాలంలో, వెలుపలనుండి ఆరు దండయాత్రలు వచ్చాయి. జాతీయ భ్రష్టత్వాలకు సహజమైన ప్రతిఫలంగాను, దైవికమైన తీర్పులుగాను అవి పరిణమించాయని మనం ముందుగానే చూచాం. "ఇశ్రాయేలీయులు యెహోవా దృష్టికి చెడుతనం జరిగించారు"; "ఇశ్రాయేలీయులు యెహోవాకు మొర పెట్టారు" అనే మార్చి మార్చి చేయబడిన ప్రతిపాదనలు న్యాయాధిపతుల గ్రంథంలో పదిసార్లు వల్లించబడ్డాయి (న్యాయాధి. 3:7, 9; 3:12, 15; 4:1, 3; 6:1, 7; 10:6, 10). ఇది వారి చరిత్రను నైతిక ప్రాముఖ్యతతో కప్పింది. మత యుద్ధాలలోను, లేదా నార్మన్ యుద్ధ విజయ చరిత్రలో కనబడునంతటి మానవత్వాన్ని యిది ప్రదర్శిస్తుంది; కాని యిందులో ఉన్న ప్రత్యేకత ఏమంటే – చివరకు ఇశ్రాయేలీయులు యెహోవా తమకు దేవుడైయుండే జాతీయ రాజ్యంగా రూపుదిద్దబడడమే.

**1. తూర్పునుండి మెసొపొతమియుల దండయాత్ర.** – అబ్రాహాము కాలంలో యూఫ్రటీస్ ప్రభువులు తమ సామ్రాజ్యాన్ని యొర్దానువరకు విస్తరింపజేసికొని, లోతును చెరపట్టుకు పోవడాన్ని చూచాం. అయిదు వందల ఏండ్లు గతించిపోయాయి. ఆ లోయ యొక్క మరొక ప్రభువు మరొక పశ్చిమ దండయాత్రను సాగిస్తాడు. ఆ కాడి క్రింద ఇశ్రాయేలీయులు ఎనిమిది సంవత్సరాలు మూల్గారు; అప్పుడు కాలేబుకు అల్లుడైన ఒత్నీయేలు దండెత్తివచ్చిన వారిని తిరిగి యూఫ్రటీస్‌కు తరుముతాడు.

**2. దక్షణమునుండి మోయాబీయుల దండయాత్ర.** – లోతు సంతతివారైన మోయాబీయులు, మృత సముద్రానికి తూర్పువైపున నివసిస్తారు. ఎగ్లోను క్రింద ఆగ్నేయ ప్రాంతపు జాతులను అణచి, యొర్దానును దాటివచ్చి యెరికోను పట్టుకొని పద్దెనిమిది సంవత్సరాలు తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. బెన్యామీనీయుడైన ఏహూదు యెరికో వద్దనున్న ఎగ్లోనుకు తన గోత్రముల కప్పమును తీసికొని వెళ్లాడు. రహస్యపు దర్శనములో అతడు ఆ రాజును కత్తితో పొడిచి, పశ్చిమ దిశగానున్న కొండలకు తప్పించుకొని పోయి, సైన్యాన్ని రేపి, యొర్దాను రేవులను పట్టుకొని, ఘోరమైన యుద్ధములో పదివేలమంది మోయాబీయులను వధించాడు. ఇది ఆ ప్రాంతానికి కనీసం ఎనభై సంవత్సరాలు నెమ్మదినిచ్చింది.

**3. ఉత్తరమునుండి కనానీయుల దండయాత్ర.** – మెరోము సరస్సు వద్ద, యాబీను నాయకత్వంలో వచ్చిన ఉత్తర రాజ్య కూటమిని యెహోషువ ఓడించాడు. తరువాత యాబీను క్రింద ఉత్తర కనానీయులు ఏకమై ఉత్తరమునసున్న గోత్రములవారిని యిరవై సంవత్సరాలు అణచారు. చిట్టచివరికి దెబోరా అనే ప్రవక్తిణి అరుదైన విశ్వాసము, ధైర్యముగలదై, నఫ్తాలి గోత్రికుడైన బారాకును ప్రేరేపించింది. పదివేల మంది సైన్యాన్ని సమకూర్చుకొని యెస్త్రఏలోన్ మైదానములో గొప్ప విజయాన్ని సాధించారు. కనానీయుల అధిపతియైన సీసెరా కాలినడకను కయీనీయుడగు హెబెరు భార్యయైన యాయేలు గుడారమునకు పారిపోయెను. హెబెరు మోషే మామయైన యిత్రో సంతతివాడు. హెబెరు భార్యయైన యాయేలు గుడారపు మేకును సుత్తెతో అతని "కణతలలోనికి దిగగొట్టగా

అతడు చచ్చెను" యుద్ధ గీతములో ఆ విజయాన్ని దెబోరా కొనియాడింది (న్యాయాధి. 5).

**4. తూర్పునుండి మిద్యానీయుల దండయాత్ర.** – మిద్యానీయులంటే, అబ్రాహాము భార్యయైన కెతూరాయొక్క సంతతివారైన, అరబ్బీయులు. వారు ఇశ్రాయేలీయుల భూ భాగంలో స్థిరపడలేదు. కోతకాలంలో దాని మీదపడి, ధాన్యాన్ని దోచుకొని వెళ్లుతూ ఉండేవారు. వారు దండెత్తేది ఎంత భయంకరంగా ఉందంటే, ఇశ్రాయేలీయులు కొండలకో, ప్రాకారములు గల పట్టణాలకో, లేక గుహలకో పారిపోవలసి వచ్చేది. మనష్షే గోత్రికుడైన గిద్యోనును దేవుడు లేపాడు. తన తండ్రి యింటను, గ్రామములోను ఉన్న బయలు ఆరాధనను లయపరచడానికి అతడు మొదలుపెట్టాడు. అతడు ముప్పై రెండువేలమంది సైన్యాన్ని సమకూర్చాడు, భయపడేవారిని యింటికి పంపివేసి పదివేలమందికి వాటిని తగ్గించాడు; మళ్లీ తగ్గించగా చివరికి మూడువందలమంది నీళ్లు తమ చేతులతో తీసికొని త్రాగినవారు మిగిలిపోయారు. ఈ చిన్న గుంపుతో రాత్రివేళ మిద్యానీయులను ఎదుర్కొని గొప్పగా హతమార్చి, తూర్పువైపునున్న ఎడారి ప్రాంతంవరకు వారిని తరిమాడు. గిద్యోను, బారాకుల విజయాలు ఉత్తరమున ఉన్న గోత్రాలవలన కలిగాయి. ఈ ఘనతలలో మధ్య భాగమందు శక్తివంతులైయున్న ఎఫ్రాయీమీయులకు ఎక్కువ పాలులేనందున మనస్తాపము నొందారు. వారి అసూయను గిద్యోను ముఖ స్తుతి చేసి శాంతపరచాడు (న్యాయాధి. 8:1–3). గిద్యోను ఆ సమయానికి కథానాయకుడయ్యాడు. కిరీటము యివ్వబడినా, అతడు స్వీకరించలేదు. ఎక్కువ ఘనత లేకున్నా, అత్యాశగల అతని కుమారుడైన అబీమెలెకు తన సహోదరులలో ఒకని తప్ప మిగిలిన వారందరిని సంహరించి, షెకెములో అల్ప కాలమున్న స్థానిక రాజరికాన్ని పొందాడు. తిరుగుబాటు అణచే ప్రయత్నంలో అతడు తన కిరీటాన్ని, ప్రాణాన్ని సహా కోల్పోయాడు.

**5. తూర్పునుండి అమ్మోనీయుల దండయాత్ర.** – మోయాబీయులవలెనే అమ్మోనీయులు కూడా లోతు సంతతి వారే. యొర్దానుకు తూర్పు ప్రాంతాన జరిగిన యుద్ధ విజయాన్నిబట్టి, వారు తూరు ఎడారిలో గుమికూడి ఉన్నారు. వారు త్వరలోనే తూర్పుననున్న గోత్రాలకు ఒత్తిడి యివ్వసాగారు. యెఫ్తా విడిపించగల సాధనమయ్యాడు. జన్మనుబట్టి తక్కువవాడు, వారసత్వం లేనివాడుగా నెట్టివేయబడినవాడు, కాని తిరిగి విడిపించబడి, ఆ స్థానంలో మరల నిలువబెట్టబడినవాడై, అమ్మోనీయులను పారద్రోలడానికి లేపబడిన సైన్యానికి అతడు నాయకుడయ్యాడు. అతడు యుద్ధానికి పోకముందు, తాను విజయవంతంగా తిరిగివస్తే తనకు మొదటిగా ఎదురుపడేది ఏదో అది తన దేవుడైన యెహోవాకు అర్పిస్తానని వాగ్దానం చేశాడు. అతడు యుద్ధాన్ని జయించాడు, తనకున్న ఒక్కతేయైన కుమార్తె అతని కలిసికొంది, మరియు, ఆమెయందు అతడు తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాడు.

**6. నైఋతినుండి ఫిలిష్తీయుల దండయాత్ర.** – మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఫిలిష్తీయులు కలహమొనర్చగల వర్తకం చేసే జనులైయున్నారు. ఫినీకే వారికి వారు పోటీ పడేవారు, మరియు ఒకసారైతే వారు సీదోనును కూడా పట్టుకున్నారు, అక్కడనుండి అది రెండవ తూరువలె క్రుంగనారంభించింది. ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులను

తలక్రిందులుగా చేసే శత్రువులు, న్యాయాధిపతుల కాలమంతటిలో వారు ఇశ్రాయేలీయులను బాధిస్తునే ఉన్నారు. శక్తివంతంగా వారు దావీదుచే పడగొట్టబడేవరకు రాజరికపు కాలంలో సహితం వారు తమ చర్యలను కొనసాగించారు. దక్షణపు గోత్రములైయున్న షిమ్యోను, దాను, యూదా అనేవారు వీరి తాకిడికి గురియైయ్యారు. మిలిటరీ వీరుల్లో కొన్ని విధాలుగా బహు సుప్రసిద్ధమైన కడపటివాడు దాను గోత్రికుడైన సంసోను. జన్మతోనే అతడు నాజరు చేయబడినవాడు, అంటే, అపవిత్రమేదైనను తినకూడదని, ద్రాక్షా సంబంధమైన దేనిని ఉపయోగించవద్దని, తన తల ఎన్నడును గొరిగించుకొనకూడదని తన తల్లిచే మాట యివ్వబడినవాడు. మానవాతీత బలమునందు అతడు ఆనందించుతూ, అగంతములను చేసే హెబ్రీయుల హెర్క్యులస్సయినా, నిరంతరం దేశభక్తి గలవాడైయుండేవాడు. నైఋతి కొండల్లో ఉన్న తన యింటనుండి ఫిలిష్తీయులపై తరచుగా ఒంటరిగానే దాడులను జరుపుతూ ఉండేవాడు. ఒక దానివెంట మరియొకటి ఫిలిష్తీయ స్త్రీలతో చేసికొన్న రెండు వివాహాలు అతని విజయానికి, పతనానికి దారితీశాయి; ఎందుకంటే, సంసోను బలహీనమైన రాక్షసుడని చెప్పవచ్చు. డెలీలా యొక్క లాలనలకు లోనై, తన బలముయొక్క రహస్యాన్ని చెప్పి, నాజరు చేయబడిన వాగ్దానానికి విరుద్ధంగా తన తల వెంద్రుకలను క్షౌరం చేయడానికి అప్పగించుకున్నాడు. అది హీనమైన దృశ్యం. ఎవని పేరు వింటే ఫిలిష్తీయులు వణికారో, ఆ సంసోను తన తలను డెలీలా ఒడిలో పెట్టాడు. దేవునిచే నిరాకరింపబడి, తన శత్రువులకు ఆహారమగునట్లు అతడు ఆమె వద్దనుండి వెలుపలికి వచ్చాడు. అంధుడుగా చేయబడి, బంధింపబడి, ఆడవారు చేసే వెట్టిపనియైన తిరుగలి విసిరే స్థితికి దిగజార్చబడ్డాడు. తన వ్రతాన్ని పునరుద్ధరించుకొనడానికిని, తిరిగి తన బలము పుంజుకొనడానికిని అవకాశం లభించింది. తన దేశపు విడుదలకు తన జీవితాన్ని సమర్పించుకున్న స్విస్ వింక్లెరైడ్‌నుపోలి, ఫిలిష్తీయుల యొక్క దాగోను దేవతకు సంబంధించిన ఉత్సవ సమయంలో జనుల వినోదం కొరకు అతడు తేబడ్డాడు. ఆ దేవాలయపు మధ్యనున్న స్తంభాన్ని ఊడబెరుకుట ద్వారా, వేలకొలది మంది తన శత్రువులతోపాటు తన్ను తాను సమాధి చేసికొంటాడు. ఫిలిష్తీయ బలము పగులగొట్టబడలేదు; అయితే అతని సాహస కృత్యాలవలన ఇశ్రాయేలీయుల ధైర్యం మరల వెలిగించబడింది. మరి ఎక్కువ నిలకడయైన పని సమూయేలు, దావీదుల ద్వారా జరిగింపబడింది.

## IV. **రూతు యొక్క కథ.**

న్యాయాధిపతుల కాలంలో రూతు గ్రంథమందు చెప్పబడిన సంగతులు జరిగాయి. ఆ కాలానికి చెందిన నెమ్మదియైన అది యొక తియ్యని గాథ. పుస్తకం పూర్తిగా చదువవలసి యుంటుంది. బహుశా, అనేక దండయాత్రలవలన, కరవు వచ్చి యుండవచ్చు, అది వారిని మోయాబుకు వలస పోయేలా చేసింది. ఎలీమెలెకు, నయోమి అనే బేత్లెహేమీయులు తమ కుమారులతో మోయాబులో ఉండగా, వారి కుమారులకు వివాహము జరిగింది. పదేండ్లు గడిచాయి, అంతలో ముగ్గురు స్త్రీలు సంతానంలేని విధవరాండ్రయ్యారు. నయోమి

గృహోన్ముఖురాలౌతుంది. ఆ యౌవన స్త్రీలుకూడా తనతో బయలుదేరుతారు. పరాయి జాతిమధ్య ఈ స్త్రీలు తమ ఒంటరి జీవితాన్ని ఎలా గడుపుతారా అని బాధపడుతూ, తన వెంట రాకుండా ఉండడానికి ప్రయత్నిస్తుంది. ఓర్ప సంకోచించి, వెనుకకు తిరుగుతుంది. మహా కావ్యమన్నట్టి భాషతో రూతు బదులిస్తుంది (రూతు 1:16, 17). అలాటి విశ్వాసము, భక్తి బహుమానం పొందకుండా పోదు. బేత్లెహేమునకు చేరుకున్న మీదట, తన భర్తకు బంధువుడైయున్న బోయజు పొలములో పరిగె ఏరుకొనడానికి రూతు వెళ్లుతుంది. తన భర్తయొక్క పేరు, అతని స్వాస్థ్యము కొనసాగేలా, నయోమి ఆదేశాన్ని బట్టి, బంధు ధర్మాన్ని వివాహపు హక్కును ఆమె కోరుతుంది; అలాగున ఆమె, దావీదునకును, మరియకును, ప్రభువైన యేసుకును గౌరవపదమైన మాతృ మూర్తిగా అయింది.

## V. ప్రవక్త - న్యాయాధిపతియైన సమూయేలు. (1 సమూ. 1-10.)

మోషే, దావీదుల మధ్య సమూయేలు చాలా ప్రాముఖ్యమైన వ్యక్తిగా ఉన్నాడు. తన కాలంలో అతడు ఒకవైపు లూథర్ మరోవైపు బాప్తిస్మమిచ్చు యోహానైయున్నాడు. జననమునుండి, మరణంవరకు తన జీవితమంతా, ఆ కాలం యొక్క హీనమైన స్థితిని అధిగమించి నిలిచియున్నాడు. బిడ్డలులేని హన్నా, బిడ్డలకొరకు తపించిన హెబ్రీ తల్లిగా, దేవుని అడిగి అతన్ని పొంది, తిరిగి అతన్ని దేవునికి సమర్పిస్తుంది. అలాగున అతడు షిలోహులోని ప్రత్యక్ష గుడారములో పెంచబడ్డాడు.

ఆ కాలంలో ప్రధాన యాజకుడైయున్న ఏలీ, "న్యాయాధిపతిగా" కూడా ఉన్నాడు. తనలో ఆ రెండు పదవులను ఏకం చేసినవాడు అతడే. వృద్ధుడైన ఏలీ, వ్యక్తిగతంగా పవిత్రుడైనా,[1] తన పిల్లలు చేస్తున్న ఘోరమైన పాపాలను అడ్డగించలేదు. బాలుడైన సమూయేలు ద్వారా దేవుడు ఏలీ యింటి నాశనాన్ని బయలుపరచాడు. ఆఫెకు అనే చోట జరిగిన యుద్ధంలో, ఫిలిష్తీయులు ఏలీ కుమారులను ఖడ్గంతో చంపి, మందసాన్ని చేజిక్కించుకున్నారు. ఆ వార్త వినగానే ఏలీ పడి చనిపోతాడు. దేవుడు సమూయేలును ప్రవక్తగా పిలిచిన నాటనుండి అంధకారమైన ఆ సంవత్సరాలనుండి జనులు నిరీక్షణతో బయటపడ్డారు. సమూయేలు యొక్క గొప్ప కార్యాలను ఈ విధంగా సంక్షిప్తం చేయవచ్చు:

(1) గొప్ప జాతీయ సంస్కరణలను అతడు తెచ్చి, నిబంధనను సరి క్రొత్తదిగా చేసి, దేవుడైన యెహోవాను ఆరాధించడానికి జనులను తిరిగి తెచ్చాడు.

(2) ఫిలిష్తీయులచే ముట్టడివేయబడగా, ఎబెనెజరు వద్ద అతడు ఎంతటి ఘన విజయాన్ని సాధించాడంటే, తాను న్యాయాధిపతిగా ఉన్న దినాల్లో మరెన్నడు ఫిలిష్తీయులు వారిపైకి రాలేదు.

(3) ప్రవక్తల పాఠశాలలను అతడు నిర్వహించాడు.

(4) తన జీవిత కాలమంతటను అతడు ఇశ్రాయేలీయులకు "న్యాయం తీర్చాడు."

(5) రాజరికానికి అతడు మార్గాన్ని సరళం చేశాడు, సౌలును అతడు అభిషేకించాడు. సౌలు నిరాకరింపబడిన పిమ్మట, అతడు దావీదును అభిషేకించాడు. న్యాయాధిపతులనుండి రాజులకు మార్పు జరిగిన కాలానికి ఆ విధంగా సమూయేలు చెందినవాడైయుంటాడు.

అతడు న్యాయాధిపతులలో ఘనుడును చివరివాడునై ఉన్నాడు. మరియు హెబ్రీ ప్రవక్తల వరుసలో మోషే తరువాత అతడు మొదటివాడైయుంటాడు.

---

సూచనలు

[1]Dean had “suffered.”

## ఇశ్రాయేలు న్యాయాధిపతులు

ఎ. మెసొపొతమియ అణచివేత
   1. ఒత్నీయేలు
బి. మోయాబు అణచివేత
   2. ఏహూదు
సి. ఫిలిష్తీయ అణచివేత
   3. షమ్గరు
డి. కనానీయుల అణచివేత
   4. దెబోరా
ఇ. మిద్యానీయుల అణచివేత
   5. గిద్యోను
   6. అబీమెలకు
   7. తోలా
   8. యాయీరు
ఎఫ్. అమ్మోనీయుల అణచివేత
   9. యెఫ్తా
   10. ఇబ్సాను
   11. ఏలోను
   12. అబ్దోను
జి. ఫిలిష్తీయ అణచివేత
   13. సమ్సోను
హెచ్చ్. మొదటి సమూయేలులో
   14. ఏలీ
   15. సమూయేలు